సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

మారేడ్‌పల్లి, డిసెంబర్ 16 : సికింద్రాబాద్ జింఖానా మైదానంలో సోమవారం హైదరాబాద్ జిల్లా సీఎం కప్ – 2024 క్రీడా పోటీలను స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగేలా రాష్ట్రం నుంచి క్రీడాకారులను తయారు చేయడానికి క్రీడా యూనివర్సిటీని, క్రీడా పాలసీని అందుబాటులోకి తీసుకొని రానున్నట్లు చెప్పారు. క్రీడా పోటీలను 16 నుంచి 21వ తేదీ వరకు కొనసాగుతాయని, 20 క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీఓ సాయిరాం, ఎస్టీఎఫ్ డిస్ట్రిక్ సెక్రటరీ శ్రీదేవి, సికింద్రాబాద్ మండల్ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో 100 మి. యూనిట్లు దాటొచ్చు!

- రికార్డు స్థాయి డిమాండ్‌కు అనుగుణంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్
- క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో విద్యుత్ డిమాండ్ వినియోగం, గతేడాది వేసవితో పోల్చుకుంటే గణనీయంగా పెరగనుందని అధికారులు అంచనా వేశారు. గతేడాది 3756 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 శాతం వృద్ధితో 4352 మెగావాట్లుగా నమోదైంది. గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా ఉన్న వినియోగం దాదాపు 12 శాతం వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరింది. రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో గణనీయంగా వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేశారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలనే ప్రభుత్వ ఆదేశానుసారం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, అధికారులు సిబ్బంది సెక్షన్ స్థాయిలో డిమాండ్‌ను మదింపు చేస్తూ తగు ఏర్పాట్లు చేసే పనుల్లో నిమగ్నం అవుతున్నట్లు చెప్పారు.

సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు..

రానున్న వేసవిలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరాకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తగు చర్యలు చేపట్టింది. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. మేడ్చల్ పరిధిలో బొరంపేట్‌లో నిర్మితమవుతున్న 132 కేవీ సబ్ స్టేషన్‌ను, టవర్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అలాగే బొరంపేట్ 33/11కేవీ సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు..

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా చేపట్టిన పనుల్లో హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ పరిధిలో 35, 11 కేవీ ఫీడర్ల విభజన, ఇంటర్లింకింగ్, 149 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు, అదనంగా ఏర్పాటు చేయనున్నారు. హబ్సిగూడ సర్కిల్ పరిధిలో 90, 11 కేవీ ఫీడర్ల విభజన, ఇంటర్లింకింగ్, 14, 33 కేవీ ఫీడర్ల విభజనతో పాటు తదితర సర్కిల్ పరిధిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు, అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ డిమాండ్‌లో భారీ పెరుగుదలకు అవకాశమున్న రంగారెడ్డి జోన్ల పరిధిలో 254, 11 కేవీ ఫీడర్ల విభజన, ఇంటర్లింకింగ్, 1252 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి పెంపు,అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్ మేడ్చల్ అట్లూరి కామేశ్, ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ వై.చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి సబితాఇంద్రారెడ్డి, కార్తిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

బీఆర్ఎస్‌కు మరింత ఆదరణ

- మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి
- బీజేపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 16: బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతున్నదని అందుకే ఇతర పార్టీల నుంచి నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు తప్పా ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు. ఎన్నికల ప్పుడు ఆరు గ్యారెంటీల హామీలిచ్చి ప్రస్తుతం వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులకే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభోత్సవాలు చేస్తున్నదని, కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనులు ప్రారంభించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ్, భగవాన్‌దాస్, రత్నం, ఉప్పల్ శ్రీను, కార్తీక్ ముదిరాజ్, ఆనంద్, లక్ష్మణ్, సంతోష్‌కుమార్, విజయ్, నబీబ్, ఫిరోజ్, రాజు, లోకేశ్, రిషి, వేదాంత, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో

సిటీబ్యూరో, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ): హౌజింగ్ లోన్ రంగంలో మార్కెట్ లీడర్‌గా నిలిచిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అతిపెద్ద ప్రాపర్టీ షో కు శ్రీకారం చుట్టింది. డిసెంబర్ 20 నుంచి 22 వరకు హైటెక్స్ వేదిక మెగా ప్రాపర్టీ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్‌కుమార్ కోఠిలోని ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి, ప్రాపర్టీ ఎక్స్‌పోను వివరించారు. గతేడాదిగా తెలంగాణ వ్యాప్తంగా రూ.10వేల కోట్ల హౌజింగ్ లోన్లను మంజూరు చేశామన్నారు. 859 అప్రూవ్డ్ ప్రాజెక్టులను కలిగి ఉన్నామని, రూ. 1200 కోట్లు బిల్డర్లకు రుణాలు అందించామని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా హౌజింగ్ లోన్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, మూడు రోజులపాటు హైదరాబాద్‌లో అతిపెద్ద ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 50కి పైగా అతిపెద్ద బిల్డర్లు ఈ ఎక్స్‌పోలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారని, సొంతింటి కలను సాకారం చేసుకోవాలనుకునే వారికి ఒకే వేదిక ద్వారా హౌజింగ్ లోన్ సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

మాదాపూర్ శిల్పారామంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్స్‌మేళాలోని స్టాల్స్‌కు సందర్శకుల తాకిడి

శిల్పారామంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళా

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ఉత్పత్తులు

కొండాపూర్, డిసెంబర్ 16: హస్తకళా, చేనేత వస్త్రాలు నగర వాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళా పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను వీక్షించేందుకు నగరం నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన హస్తకళా, చేనేత కళాకారులు తమ ఉత్పత్తులను సరసమైన ధరలకే నగర వాసులకు అందిస్తున్నారు. ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు కొనసాగనున్న ఈ మేళాలో శ్రీ కాళహస్తి చెక్క విగ్రహాలు, జ్యూట్ బ్యాగులు, వెదురు బుట్టలు, మట్టి పాత్రలు, కాశ్మీరి శాలువాలు, కాటన్ అద్దకం చీరలు, పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, గద్వాల్ పట్టు చీరలు, డ్రెస్ మెటీరియల్స్ తదితర చేనేత, హస్తకళా ఉత్పత్తులు స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నాయి. మేళాకు విచ్చేసిన సందర్శకులకు ప్రత్యేక ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 31 వరకు జరగనున్న ప్రదర్శనలను శిల్పారామంలోని యాంఫీ థియేటర్‌లో సాయంత్రం నిర్వహించనున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు..

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆలిండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా సోమవారం పలువురు కళాకారులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి. ప్రదర్శనలో భాగంగా అనూష శ్రీనివాస శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. ఇందులో భాగంగా గజవదన బేడువే, కులుకాగా పడవరో, రారా వేను స్వరజతి, జతిస్వరం, దశావతార శబ్దం, హిందోళ తిల్లానా వంటి అంశాలను ప్రదర్శించారు. అలాగే రష్మీ సచ్చిదానంద శిష్య బృందం భరతనాట్య రూపంలో సందర్శకులను ఆద్యంతం ఆకట్టుకుంది.

నీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

దావోస్ ఒప్పందాలను రేవంత్ రెడ్డి బయటపెట్టాలి

తమ్మినేని వీరభద్రం

చౌటుప్పల్, డిసెంబర్ 16 : అమెరికాలోని దావోస్‌లో అదానీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా మూడో మహాసభలు చౌటుప్పల్‌లో జరుగుతుండగా, రెండో రోజు సోమవారం ఆయన హాజరై మాట్లాడారు. దావోస్‌లో రూ.12,400కోట్లకు అగ్రిమెంట్లు జరిగాయన్నారు. అందులో సోలార్ ప్రాజెక్టు ఒప్పందాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని ఎలా చేసుకున్నారో రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించాలన్నారు. ఏడాది సంబురాలు చేస్తున్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేసిందో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లు బీజేపీ ప్రవేశపెట్టడం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే చర్య అని అభిప్రాయపడ్డారు. తద్వారా ఫెడరల్ వ్యవస్థను బలహీనం చేసి రాష్ట్రాల శక్తులను తక్కువ చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఒకసారి ఎన్నికలు పెడితే ఆర్థికంగా ఖర్చు తగ్గడం కాక పెరుగుతుందన్నారు. సమావేశాల్లో సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి పత్రీజీ ధ్యాన మహాయాగం

ఖైరతాబాద్, డిసెంబర్ 16: ది పిరమిడ్ స్పిరిచ్వల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, ఆస్మాన్‌పల్లిలోని మహేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పత్రీజీ ధ్యాన మహాయాగం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహా యాగానికి సంబంధించిన బ్రోచర్లను ట్రస్ట్ సభ్యులు శ్రీరామ్‌గోపాల్, సాంబశివరావు, మారం శివప్రసాద్, మాధవి, సురేశ్ బాబు, బాలకృష్ణతో కలిసి ఆవిష్కరించారు. మహాయాగం సందర్భంగా 225 గంటల అఖండ ధ్యానం జరుగుతుందని, 11 రోజుల పాటు జరిగే ఈ క్రతువుకు దేశ, విదేశాల నుంచి హాజరయ్యే వారితో పాటు సుమారు 10 లక్షల మందికి అన్నదాన కారక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

కార్మిక చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ వ్యవహారం

చిక్కడపల్లి, డిసెంబర్16: కాంగ్రెస్ సర్కార్ కార్మిక చట్టాలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య మండిపడ్డారు. ఏకపక్షంగా కనీస వేతనాల సలహా మండలి సభ్యుల ఎంపిక చేశారని ధ్వజమెత్తారు. ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా ఇతర యూనియన్ల ప్రతినిధ్యం లేకుండా కనీస వేతనాల సలహా మండలిలో బోర్డు సభ్యులను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కనీస వేతనాల జీవోను తగ్గించడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేక రంగాల్లో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. వారి సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపారు. కోటీ 80లక్షల మంది కార్మికులు ఉన్న శాఖకు సంవత్సరం నుంచి మంత్రి లేకపోవడం సిగ్గు చేటన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు, పోరాటాలు చేయనునట్లు వెల్లడించారు. ఈ నెల 23న కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాయిబాబా, వీఎస్ రావు, భూపాల్, ఏఐటీయూసీ షరీఫ్, ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎం. శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య

అరుణోదయ సభ తీర్మానాలు

సిటీబ్యూరో, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ) : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50వ వార్షికోత్సవ సమావేశాలను ఘనంగా నిర్వహించారు. వీఎస్‌టీ ఫంక్షన్ హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సభ తీర్మానాలను సోమవారం విడుదల చేశారు. ఇందులో స్వయం పోషిత వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయడం, పర్యావరణ పరిరక్షణ, అటవీ భూముల అన్యాక్రాంతాన్ని నిరోధించడం, బహుళ జాతి కంపెనీల చేతిల్లోకి పర్యావరణం, అడవులు, చెరువులు, నదులు వెళ్లకుండా నియంత్రించడం వంటి వాటిపై తీర్మానం చేశారు. మూసీ ప్రక్షాళన, ఎస్సీ వర్గీకరణ, విద్యా కాషాయీకరణపై నిరసించడం, ప్రజా సాంస్కృతిక రంగాల కర్తవ్యాలను పెంపొందించడం, ఎన్‌కౌంటర్ హత్యలు, సామాజిక రంగాల్లో ప్రజలకు సమానమైన హక్కులు కల్పించడం వంటి తదితర అంశాలపై తీర్మానాలకు అరుణోదయ సభ ఆమోదం తెలిపినట్లుగా అధ్యక్షుడు ఏపూరి మల్సూర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సీ.అనిత, ప్రభాకర్, సురేశ్, ప్రధాన కార్యదర్శి రమేశ్ పోతుల, సహాయ కార్యదర్శులు రాకేశ్ నూతన్, కోశాధికారి భాస్కర్ నాయక్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పల్టీకొట్టిన డీజిల్ ట్యాంకర్

- 20 వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ రోడ్డు పాలు
- సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్

ఆలుగడ్డ బావి చౌరస్తాలో పల్టీ కొట్టిన ట్యాంకర్‌ను క్రేన్‌ల సహాయంతో పక్కకు తొలగిస్తున్న దృశ్యం

సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ)/మారేడ్‌పల్లి : సికింద్రాబాద్ ఆలుగడ్డబావి చౌరస్తా వద్ద పెట్రోల్, డీజిల్ ట్యాంకర్ అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటన గోపాలపురం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... చర్లపల్లిలోని భారత్ పెట్రోల్ కార్పొరేషన్ సంస్థ నుంచి డీజిల్ ట్యాంకర్ సూరారంలోకి ఓ పెట్రోల్ బంక్‌కు పెట్రోల్, డీజిల్‌ను తీసుకెళ్తున్నది. ఉదయం 11:30 గంటలకు మెట్టుగూడ ఆలుగడ్డబావి చౌరస్తాలో డీజిల్ ట్యాంకర్ టైర్ పగిలి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ట్యాంకర్‌లో ఉన్న 10 వేల లీటర్ల పెట్రోల్, 10 వేల లీటర్ల డీజిల్ రోడ్డు పాలైంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదం పొంచి ఉందని గుర్తించి, వెంటనే వాహనాలను మరో దారి గుండా మళ్లించారు. జీహెచ్ ఎంసీ, అగ్నిమాపక సిబ్బంది మంటలు రాకుండా సహాయక చర్యలు చేపట్టారు. నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రెండు గంటల పాటు సహాయక చర్యలు..

పల్టీ కొట్టిన డీజిల్ ట్యాంకర్‌ను మూడు క్రేన్‌లు, జేసీబీల సహాయంతో రెండు గంటల పాటు శ్రమించి నిప్పు రవ్వలు రాకుండా ఘటనా స్థలం నుంచి రోడ్డు పక్కకు తరలించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఏమాత్రం ఆలస్యమైనా ట్యాంకర్ పేలే ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలిపారు. డ్రైవర్ చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలు కావడంతో గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 16 : మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి ఉన్నీకృష్ణన్ అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంట చేస్తున్నారని తెలిపారు. దాంతో కార్మికులు అప్పులపాలు అవుతున్నారని, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో ప్రకటించిన రూ. 10 వేలు వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రేమలత, మధ్యాహ్న భోజన కార్మికులు సువర్ణ, సువద, సుజాత, చంద్రకళ, శంకరీబాయి, మంగ, మంజుల, వసంత పాల్గొన్నారు.

సేవల్లో నిర్లక్ష్యం.. వినియోగదారులకు నష్టం

hmda
Growing Global

సిటీబ్యూరో, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏలో పాలన పడకేసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఏడాది కాలంగా ఏడు జిల్లాల్లో విస్తరించిన హెచ్ఎండీఏకు పూర్తి స్థాయి కమిషనర్ విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ పాలనలో మాత్రం మార్పు రావడం లేదు. ఉన్నతాధికారుల అలసత్వంతో కింది స్థాయి సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇటీవల జరుగుతున్న కొన్ని పరిణామాలు కూడా అందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. అయినా కూడా పాలన తీరుపై కమిషనర్ దృష్టి పెట్టకపోవడంతో.. పౌరులకు హెచ్ఎండీఏ సేవలు అందడం లేదు.

హెచ్ఎండీఏకు జరిమానాలు..

విధుల్లో నిర్లక్ష్యం కారణంగా హెచ్ఎండీఏకు వరుస జరిమానాలు పడుతున్నాయి. ట్యాంక్ బండ్‌పై హెచ్ఎండీఏకు ఉన్న పార్కింగ్ స్థలంలో ఓ వాహనదారుడి బైక్ దొంగతనానికి గురైంది. ఈ విషయంలో హెచ్ఎండీఏ, సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని తేల్చి ఏకంగా రూ. 30వేలను 45రోజుల్లో బాధితుడికి చెల్లించాలని ఆదేశించింది. అలాగే హెచ్ఎండీఏ వేలం వేసిన గృహ కల్ప ప్రాజెక్టులో ఓ వినియోగదారుడు త్రిపుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకుని ఓపెన్ పార్కింగ్‌తోపాటు, ఫ్లాట్ కోసం కొంత మొత్తాన్ని చెల్లించారు. అయితే అనివార్య కారణాలతో ఆ లావాదేవీ నిలిచిపోవడంతో.. హెచ్ఎండీఏ ఇతరులకు ఆ ఫ్లాట్‌ను విక్రయించింది. వినియోగదారులు కట్టిన మొత్తాన్ని వాపస్ చేసింది కానీ, పార్కింగ్ ప్లేస్ కోసం కట్టిన రూ. 3లక్షలను ఇవ్వకుండా అధికారులు ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయంలో వినియోగదారుల ఫోరాన్ని బాధితులు ఆశ్రయించగా, రాజీవ్ స్వగృహ, హెచ్ఎండీఏ విభాగాలు రూ.లక్ష రూపాయలు వడ్డీతో కలిపి పరిహారంగా చెల్లించాలని ఆదేశించింది. ఇలా వరుస జరిమానాలతో హెచ్ఎండీఏ పనితీరుపై ఎంఏయూడీ ఉన్నతాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పౌర సేవల విషయంలో అధికారులు జాడ్యం వీడాలని, ఉన్నతాధికారులు తరచూ సమీక్షించడం ద్వారా పని తీరు మెరుగుపడుతుందని పలువురు చెబుతున్నారు.

మాలలను కించపరిచే మాటలు సహించం

- చరిత్ర మరిచి మాట్లాడుతున్న మంద కృష్ణ జాగ్రత్త..
- భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు మందాల భాస్కర్

విలేకరుల సమావేశం అనంతరం నినదిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 16: మాలలను కించపరిచే మాటలు మాట్లాడితే సహించబోమని భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మందాల భాస్కర్ అన్నారు. ఇప్పటికైనా మంద కృష్ణ మాదిగ తన వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ.. యావత్ సమాజాన్ని చైతన్యం చేసింది మాల లేనన్నారు. నాటి కారంచేడు ఘటనలో మాదిగలకు అండగా నిలిచింది మాలలేనని, మాదిగలకు న్యాయం కోసం ముందుండి పోరాడింది మాలలు కాదా అని ప్రశ్నించారు. చరిత్ర మరిచిన మందకృష్ణ నోటికొచ్చినట్లు మాట్లాడితే లక్ష గొంతుకలై తిరగబడతామని హెచ్చరించారు. ఈనెల 27న లక్ష డప్పులతో మాలలకు చావు డప్పు కొడతామని మంద కృష్ణ అహంకార పూరితంగా మాట్లాడిన మాటలను తీవ్రంగా కండించారు. ఇప్పటికైనా మాలలపై విషం చిమ్మే మాటలు మానుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్, నాయకులు మాదాసు రాహుల్, పండుగ భాను తేజ, ప్రదీప్, మల్లికార్జున్, యశ్వంత్, అభిషేక్, బాలు తదితరులు పాల్గొన్నారు.